# సుతిమెత్తని సుత్తి

ఇటు సాంప్రదాయిక సాహిత్యానికి, అటు ఆధునిక సాహిత్యానికి, సేతువుగా ఉన్న ఒక సాహిత్య సంస్థ ఉగాదినాడు కవి సమ్మేళనం నిర్వహించ తల పెట్టింది. ఒక్కొక్క కవి తన పద్యాలు గాని, గేయాలుగాని, అయిదు నిమిషాలకి మించకుండా చదవాలనే నియమం పెట్టేరు నిర్వాహకులు. ఎందుకంటే 30 మంది పాల్గొనవలసిన సమ్మేళనం అది. కనీసం రెండున్నర గంటల సమయం పడుతుంది.

ముప్పయ్ మంది పేర్లతోనూ కరపత్రాలు అచ్చయ్యాయి.

ప్రార్థన, అధ్యక్షుని తొలి పలుకులతో సభ ప్రారంభమైంది. కాల నియమాన్ని పాటిస్తూ జాగ్రత్తగా ఐదు నిమిషాలు మించకుండా 30 మంది కవులు తమ కవితల్ని వినిపించారు.

పది గంటలకి ప్రారంభించిన సమ్మేళనం అధ్యక్షుని మలి పలుకులతో 12-45కి ముగింపబోతుండగా

"అధ్యక్షా! మీరింత పేపూ ఐదేసి నిమిషాలు చొప్పున కవితలు చదవడానికి అవకాశం ఇచ్చారు. ఇదికూడా చాలా ఎక్కువే. నేను ఒకే ఒక్క పద్యాన్ని, ఒకే ఒక్క నిమిషంలో చదివి వినిపిస్తాను. నాకో అవకాశం ఇవ్వండి" అని ఇటీవలవే సప్తతి జన్మదినోత్సవం జరుపుకున్న ఒక స్థానిక కవిశేఖరుడు సువర్ణ ఘంటాకంకణ, కవిశార్దూల, కవి మత్తేభ బిరుదాంకితుడు అధ్యక్షుల వారి అనుమతి కోరేడు.

ఒక్క నిమిషమే కదా అని సరే అన్నారు అధ్యక్షులు.

సువర్ణ ఘంటాకంకణులు వేదిక మీదకు వచ్చారు.

"సోదర సోదరీమణులారా! మీకందరికీ తెలుసు. ఇదీ స్పీడ్ ఏజ్. మానవుడు చంద్రమండలం మీదికి గంటకి కొన్ని వేల కిలోమీటర్ల స్పీడులో పయనిస్తుంటే ఆ ప్రభావం మనమీద పడక తప్పదు. అందుకే ఎంతమంది సదస్సులో పాల్గొన్నా ఆ సదస్సు ఓ గంట కంటే ఎక్కువ జరగకూడదు ఇంగ్లీష్ సినిమాలు చూడండి. సినిమా అంతా ఓ గంటలో

అయిపోతుంది. అంతకన్నా ఎక్కువైతే ఆ ప్రేక్షకులు చూడలేరు'' అంటూ ఆ 70 ఏళ్ల వృద్ధకవిను చదవబోయే పద్యం ఏ ఛందమో,ఏచందమో ఏయతో ఏ ప్రాసో, ఏ అలంకారమో, ఏ వ్యాకరణమో, ఆ పద్యం రాయడానికి ప్రేరణ ఏమిటో, ఎవరో విపులంగా విపుల మీద ఉన్న పద్యచ్ఛందస్సుల్లోని వైవిధ్యాల్ని ఉటంకిస్తూ

తన పద్యాన్ని చదివేడు!

పద్యం చదివింది మాత్రం ఒక్క నిమిషమే!

శీర్షిక కూడా 'ఒక్క నిమిషమే'

కానీ పద్య పఠనానికి ముందు 'ఉపోద్ఘాతం' పేరుతో తాను వేసిన విద్యుద్ఘాతపు సుతిమెత్తని సుత్తిదెబ్బకు శ్రోతలు అసలే ఆకళ్లతో డొక్కలు మాడి, ఎక్స్‌రే ఫోటోల నెగిటివ్స్‌లా ఉన్నారేమో పాపం సొమ్మసిల్లిపోయారు!!

అతను చదివిన పద్యం మాత్రం తాను అన్నమాట ప్రకారం 'ఒక్క నిమిషం' లోనే ముగించాడు!

10-2-1989

ఆంధ్రభూమి దినపత్రిక